సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 24 । డిసెంబర్ । 2023



దండగర్ర విద్యార్థుల ప్రతిభ

తాడేపల్లిగూడెం రూరల్: చెకుముకి-2023 టాలెంట్ సైన్స్ టెస్ట్‌లో దండగర్ర హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.



27 నుంచి టెన్నిస్ పోటీలు

ఏలూరు రూరల్: విజయవాడలో ఈనెల 27 నుంచి జరిగే సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ టెన్నిస్ టోర్నమెంట్‌కు వైఎస్సార్ హెల్త్ సైన్స్ వర్సిటీ పురుషుల జట్టును ఎంపిక చేశారు.



వాసవి మాతకు పుష్పార్చన

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక ఆర్యవైశ్య వర్తక సంఘ భవనంలో ముక్కోటి సందర్భంగా వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి లక్ష గులాబీలతో పుష్పార్చన చేశారు.

న్యూస్‌రీల్

సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి



వైజ్ఞానిక ప్రదర్శన విజేతలతో డీఈఓ

భీమవరం అర్బన్: శాస్త్ర, సాంకేతిక రంగాలు కొత్త పుంతలు తొక్కుతున్న తరుణంలో విద్యార్థి దశ నుంచే సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలని డీఈఓ ఆర్.వెంకటరమణ అన్నారు. మండలంలోని చినఅమిరంలో రెండు రోజుల పాటు జరిగిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ వైజ్ఞానిక ప్రదర్శనలో 19 మండలాల నుంచి 3 కేటగిరీల్లో 57 ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించంగా విభాగానికి 3 చొప్పున 9 ఎగ్జిబిట్స్ రాష్ట్రస్థాయిలో ఎంపిక చేశామన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. జిల్లా సైన్స్ అధికారి వీఎంజెడ్ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 28, 29లలో కడపలో రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఉంటుందన్నారు. ఎస్ఆర్‌కేఆర్ డైరెక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపాల్ కంతేటి మురళీ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారు

- **వ్యక్తిగత విభాగం:** వి.సింహాద్రి అప్పన్న (ఎన్నార్పీ అగ్రహారం హైస్కూల్), షేక్ అల్మాస్ (తాడేపల్లిగూడెం హైస్కూల్), ఎం.హేమంత్ శివ (దండగర్ర హైస్కూల్).
- **గ్రూపు విభాగం:** వి.అలేఖ్య, కె.ఎంజెల్ (కోపల్లె హైస్కూల్), ఎ.ప్రతాపరాజు, జీఆర్‌వీ సాయిదుర్గ (తాడేపల్లిగూడెం హైస్కూల్), పి.అక్షయ, వి.మధుర మీనాక్షి (భీమవరం ఏఆర్‌కేఆర్ఎం హైస్కూల్).
- **ఉపాధ్యాయుల విభాగం:** సీహెచ్ ఎల్‌వీఎస్ చలం (గొరగనమూడి), ఎస్.సూర్యనారాయణ (దువ్వ), కె.శ్రీలతాదేవి (నీటిలిప్ప).

ఆట స్థలాల ముస్తాబు

భీమవరం: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను విజయవంతం చేసేందుకు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఈనెల 26 నుంచి ప్రారంభించనున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై సమీక్షించారు. ప్రతి సచివాలయం పరిధిలో కార్యక్రమాన్ని భారీస్థాయిలో ప్రారంభించాలన్నారు. క్రీడలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తికావడంతో క్రీడాకారుల బృందాలు ఏర్పాటు నూరు శాతం పూర్తిచేయాలన్నారు. ఆటస్థలాలను సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కె.సంగీత్ మాధుర్, డీఈఓ ఆర్.వెంకటరమణ, డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, చీఫ్ కోచ్ ఎం.దుర్గారావు, పీడీలు పాల్గొన్నారు.

27 నుంచి కుష్టు వ్యాధిపై సర్వే



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ మహేశ్వరరావు

భీమవరం(ప్రకాశం చౌక్): జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనలో భాగంగా కుష్టు బాధితులను గుర్తించే కార్యక్రమం ఈనెల 27 నుంచి వచ్చేనెల 12 వరకు జరుగనుందని, ఇంటింటి సర్వేను విజయవంతం చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ డి.మహేశ్వరరావు అన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పరిశీలన చేయాలని, వ్యాధిపై అనుమానం ఉంటే వైద్యాధికారి చూపించి వ్యాధి నిర్ధారణ చేయాలన్నారు. జిల్లాలో గతేడాది నవంబర్‌లో 46 కేసులు, ఈ ఏడాది జూన్‌లో 54 కేసులు గుర్తించామన్నారు. 100 కేసులు పూర్తిగా నయమయ్యాయన్నారు. 2027 నాటికి లెప్రసీ కేసులు జీరో శాతం చేయాలన్నదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని, ఈ దిశగా అధికారులంతా పనిచేయాలన్నారు. వ్యాధిని ప్రారంభదశలో గుర్తించి ఎండీటీ చికిత్స చేయిస్తే అంగ వైకల్యానికి దారితీయ్యదని, ప్రతిఒక్కరూ లెప్రసీపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, అదనపు డీఎంహెచ్ఓ బి.భానునాయక్, డిప్యూటీ పారామెడికల్ అధికారి కేవీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



శేష వాహనంపై కొలువైన శ్రీవారు



శ్రీవారి క్షేత్రం.. భక్తజన సంద్రం.. ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ



గరుడ వాహనంపై శ్రీవారు, చిత్రంలో ఈఓ, అనువంశిక ధర్మకర్త

ఇల వైకుంఠం

నేత్రపర్వం.. చినవెంకన్న ఉత్తర ద్వార దర్శనం

ద్వారకాతిరుమల: వైకుంఠ ఏకాదశి (ముక్కోటి) పర్వదినాన్ని పురస్కరించుకుని చినవెంకన్న దివ్య క్షేత్రం ఇల వైకుంఠాన్ని తలపించింది. ఉత్తర ద్వార దర్శన వేడుకలు అట్టహాసంగా జరిగాయి. సర్వాంగ సుందరంగా ముస్తాబైన ఉత్తర ద్వారం వద్ద వెండి గరుడ వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వేంచేపు చేసి విశేషంగా అలంకరించారు. వేకువజామున 4.30 గంటలకు ఉత్తర ద్వారాలను తెరవగా దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాథరావు, ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు, ఏలూరు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి, ట్రస్టు బోర్డు సభ్యులు కుటుంబ సమేతంగా స్వామిని దర్శించి పూజాదికాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు సర్వదర్శన భాగ్యాన్ని కల్పించారు. ఉదయం 7 గంటల సమయంలో ఉత్సవమూర్తులు వెండి గరుడ వాహనంపై గ్రామోత్సవానికి బయలుదేరారు. అనంతరం ఉత్తర ద్వారం వద్ద వెండి శేష వాహనంపై కొలువైన స్వామి, అమ్మవార్లు రాత్రి 9 గంటల వరకు భక్తులకు దర్శనమిచ్చారు. సుమారు 40 వేల మందికి పైగా భక్తులు శ్రీవారిని దర్శించి తరించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జడ్జి చింతలపూడి పురుషోత్తంకుమార్, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, విజిలెన్స్ ఎస్పీ కనకరాజు, పలువురు న్యాయమూర్తులు, ఇతర ప్రముఖులు శ్రీవారి ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు.

దీక్షల విరమణ : గోవింద దీక్షాదారులు వేకువజామున ఆలయ ప్రధాన రాజగోపుర మెట్ల మార్గంలో కర్పూరంతో స్వామివారి శంఖు, చక్ర, నామాలను ఏర్పాటు చేసి వాటిని వెలిగించారు. అనంతరం ఇరుముడులతో ఉత్తర ద్వార దర్శనం చేసుకుని దీక్షలు విరమించారు. వేలాది మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఆడుదాం ఆంధ్రకు సిద్ధం

క్రీడలకు పట్టం

- నేడు ఏలూరు, భీమవరంలో 3కే రన్
- ఉమ్మడి జిల్లాలో అనూహ్య స్పందన
- 26 నుంచి ఆటల పోటీలు
- 3.18 లక్షల మంది నమోదు
- 541 క్రీడా ప్రాంగణాల ముస్తాబు



నూజివీడులో 3కే రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పూర్తిస్థాయిలో ముస్తాబైంది. సంక్రాంతి సంప్రదాయ క్రీడా పోటీల కంటే రెండు వారాల ముందుగానే జిల్లాలో క్రీడా సంబరాల సందడి మొదలైంది. క్రీడలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టి కేవలం ఆటల పోటీలను నిర్వహించడంతో పాటు క్రీడా ప్రాంగణాల మరమ్మతులు, అభివృద్ధి పనులతో పాటు లక్షల మంది విద్యార్థులను భాగస్వాములను చేసేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 37 వేలకు పైగా కిట్లను పంపిణీ చేసింది.

34 రోజులపాటు క్రీడా సందడి

నియోజకవర్గాల వారీగా అధికారులు ఆడుదాం ఆంధ్రపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. ఇప్పటికే ఆడుదాం ఆంధ్ర 2కే, 3కే రన్ పేరుతో పరుగు పోటీలు నిర్వహించారు. ఆదివారం ఏలూరు, భీమవరంలో 2కే, 3కే రన్ నిర్వహించనున్నారు. ఈనెల 26 నుంచి ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో క్రీడాపోటీలు స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో ప్రారంభించనున్నారు. వచ్చేనెలాఖరు వరకు సుమారు 34 రోజుల పాటు క్రీడా కోలాహలం కనిపించనుంది.

లక్షల్లో రిజిస్ట్రేషన్లు : ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఏలూరు జిల్లాలో 1,47,013 మంది, పశ్చిమగోదావరి జిల్లాలో 1,71,195 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈనెల 26 నుంచి వచ్చేనెల 9 వరకు గ్రామస్థాయిలో, వచ్చేనెల 10 నుంచి 23 వరకు మండల స్థాయిలో, వచ్చే నెల 24 నుంచి 30 వరకు జిల్లాస్థాయి పోటీలు నిర్వహించనున్నారు. ప్రధానంగా ఐదు రకాల క్రీడలు క్రికెట్, బ్యాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖోకు ప్రాధాన్యమిచ్చారు.



క్రీడాకారులకు కిట్లు అందిస్తున్న దృశ్యం

	పశ్చిమ గోదావరి	ఏలూరు జిల్లా
రిజిస్ట్రేషన్లు	1,71,195	1,47,013
క్రీడా ప్రాంగణాలు	223	318
కిట్ల పంపిణీ	17,901	19,847

ఉమ్మడి జిల్లాలో 541 క్రీడా ప్రాంగణాలు

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పూర్తిస్థాయిలో క్రీడాప్రాంగణాలను సిద్ధం చేశారు. ఏలూరు జిల్లాలో 318, పశ్చిమగోదావరిలో 223 క్రీడా ప్రాంగణాలను గుర్తించారు. ప్రత్యేకంగా ఏలూరులో 114 ప్రాంగణాలను క్రికెట్ కోసం కేటాయించారు. అలాగే మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయిలో బ్రాండ్ అంబాసిడర్లను ఎంపిక చేశారు. జిల్లాస్థాయిలో గెలుపొందే జట్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో తలపడనున్నాయి.

నగదు బహుమతులు

- **నియోజకవర్గ స్థాయి:** మొదటి స్థానం రూ.35 వేలు, రెండో స్థానం రూ.15 వేలు, మూడో స్థానం రూ.5 వేలు.
- **జిల్లాస్థాయి:** మొదటి స్థానం రూ.60 వేలు, రెండో స్థానం రూ.30 వేలు, మూడో స్థానం రూ.10 వేలు.
- **రాష్ట్రస్థాయి:** మొదటి స్థానం రూ.5 లక్షలు, రెండో స్థానం రూ.3 లక్షలు, మూడో స్థానం రూ.2 లక్షలు

ప్రాంగణాల అభివృద్ధి

కేవలం పోటీలను నిర్వహించడమే కాకుండా క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేయడం, క్రీడాకారులకు సంబంధించిన కిట్ల పంపిణీ, భారీగా నగదు బహుమతులు ఇవ్వనున్నారు. ఏలూరు జిల్లాలో రూ.21.72 లక్షలతో క్రీడా ప్రాంగణాల పనులు పూర్తి చేయడంతో పాటు 19,847 కిట్లు పంపిణీ చేశారు. పశ్చిమగోదావరిలో 17,901 కిట్లు క్రీడాకారులకు పంపిణీ చేశారు. మొత్తంగా పోటీల నిర్వహణ కోసం 6,050 మంది ఉద్యోగులతో టీమ్ సిద్ధం చేశారు. ఇందులో 257 మంది పీఈటీ, 60 మంది సీనియర్ క్రీడాకారులతో పాటు మండలపరిషత్, రెవెన్యూ, విద్య, ఆరోగ్యశాఖల జిల్లా మండల, సచివాలయస్థాయి అధికారులు ఉన్నారు.

క్రీడా పరికరాలు వచ్చాయి



ఆడుదాం ఆంధ్ర పోటీల కోసం ప్రభుత్వం 605 సచివాలయాలకు కోట్ల రూపాయల విలువైన క్రీడా సామగ్రి అందజేసింది. నియోజకవర్గ, జిల్లాస్థాయి విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లు, షీల్డ్స్‌తో పాటు నగదు బహుమతి అందిస్తాం. ఐదు క్రీడాంశాల్లోనే కాకుండా సచివాలయ, మండల స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహిస్తాం.
– బి.శ్రీనివాసరావు, డీఎస్‌డీఓ

సీఎం జగన్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన

29న భీమవరం రాక



హెలీప్యాడ్ ప్రాంతంలో సూచనలిస్తున్న జేసీ రామసుందర్‌రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరంలో ఈనెల 29న జరిగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి ఆదేశించారు. సీఎం పర్యటన నేపథ్యంలో శనివారం స్థానిక బైపాస్ రోడ్డులోని గ్రంధి వెంకటేశ్వరరావు ప్రభుత్వ జూనియర్ కాలేజీ వెనుక లేఅవుట్‌లో సభావేదిక, లూథరన్ హైస్కూల్ ప్రాంగణంలో హెలీప్యాడ్‌ను అధికారులతో కలిసి ఆయన పరిశీలించి సూచనలిచ్చారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. సభాస్థలి ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, బారికేడ్లు తదితర ఏర్పాట్లు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. సభాస్థలం సుందరీకరణ, ఏర్పాట్లలో లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. హెలీప్యాడ్ నుంచి సభాస్థలి వరకు పూర్తిస్థాయిలో శానిటేషన్, సుందరీకరణ పనులు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఆర్డీఓ కె.శ్రీనివాసులు రాజు, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ కానాల సంగీత్‌మాధుర్, ఆర్అండ్‌బీ అధికారి బి.లోకేశ్వరరావు, తహసీల్దార్ వై.రవి కుమార్, మున్సిపల్ ఇంజనీర్ పి.త్రినాథరావు ఉన్నారు.

ధాన్యం సొమ్ము సత్వర చెల్లింపు

సాక్షి, భీమవరం: ప్రభుత్వం రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తూ ధాన్యం సేకరణ ప్రక్రియ చేస్తుందని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 4.21 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని ప్రాథమిక అంచనాగా ఉందన్నారు. 261 ఆర్‌బీకేల ద్వారా ఇప్పటివరకు 47,324 మంది రైతుల నుంచి రూ.686.22 కోట్ల విలువైన 3.14 లక్షల టన్నుల ధాన్యం సేకరించామన్నారు. ధాన్యం విక్రయించిన తర్వాత సొమ్ములు చెల్లించేందుకు నిర్ణీత గడువు 21 రోజులు కాగా కేవలం మూడు, నాలుగు రోజుల్లోనే రైతులకు ధాన్యం సొమ్ములు చెల్లిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 42,692 మంది రైతుల ఖాతాలకు రూ.619.87 కోట్లు జమయ్యాయన్నారు. మరో రెండు, మూడు రోజుల్లో 4,632 మంది రైతులకు రూ.66.35 కోట్లు చెల్లించనున్నామని, త్వరలోనే వారి ఖాతాలకు జమచేస్తామన్నారు.

గూటాలలో చోరీ



గూటాలలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సిబ్బంది

పోలవరం రూరల్: గూటాల గ్రామంలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో శనివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఎస్సై ఎస్ఎస్ పవన్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని నూకా వరదరాజు అనే వ్యక్తి ఇంట్లో ఈ నెల 20వ తేదీన శుభకార్యం జరిగింది. శుక్రవారం సాయంత్రం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులు పాలకొల్లులో విందుకు వెళ్లారు. తిరిగి అర్ధరాత్రి ఇంటికి చేరుకోగా, బయట తలుపులు బద్దలుకొట్టినట్లు ఉండటాన్ని గమనించి ఆందోళనతో ఇంట్లోకి వెళ్లి చూడగా, బీరువాలో ఉండాల్సిన 20 కాసుల బంగారం, 200 గ్రాముల వెండి వస్తువులు అపహరణకు గురైనట్లు గుర్తించారు. వరదరాజు భార్య నూకా కృష్ణవేణి ఫిర్యాదుతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీమ్‌ను రప్పించి ఆధారాల సేకరించే ప్రయత్నించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి ముఠా అరెస్టు

- నలుగురు నిందితులకు రిమాండ్
- 22.70 కిలోల గంజాయి స్వాధీనం



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న డీఎస్పీ, సీఐ తదితరులు

నరసాపురం రూరల్ : అక్రమంగా గంజాయిని కలిగి ఉన్న నలుగురు ముఠా సభ్యులను మొగల్తూరు పోలీసులు అరెస్టు చేసినట్లు నరసాపురంంంంంలలఋ డీఎస్పీ రవి మనోహరాచారి చెప్పారు. శనివారం నరసాపురం రూరల్ సీఐ కార్యాలయంలో డీఎస్పీ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మొగల్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా జరుగుతుందన్న ముందస్తు సమాచారంతో 216వ నంబర్ జాతీయ రహదారి పక్కన ఉన్న ఏటిపుంతలోని ఖాళీ ప్రాంతంలో శుక్రవారం గంజాయిని కలిగి ఉన్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేశామన్నారు. వీరి నుంచి 22.750 కిలోల గంజాయితో పాటు నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిలో ముగ్గురు నిందితులు పెరవలి మండలానికి చెందిన జనపరెడ్డి మల్లేశ్వరరావు, భోగవెల్లి శివ, చినిమిల్లి శివకృష్ణ ఉన్నారు. వీరిలో చినమిల్లి శివకృష్ణ గతంలో కూడా గంజాయి కేసుతో పాటు మరో నాలుగు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడన్నారు. మరో వ్యక్తి పాలకొల్లుకు చెందిన బుసి సూర్య వంశీకుమార్ ఉన్నారన్నారు. ఎస్పీ యు.రవిప్రకాష్ ఆదేశాల మేరకు గంజాయి కేసులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని డీఎస్పీ చెప్పారు. ఈ కేసుకు సంబంధించి ఇంకా విచారణ చేయాల్సి ఉందని, నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారన్నారు. నరసాపురం రూరల్ సీఐ కె.గోవిందరాజులు, మొగల్తూరు ఎస్సై వీరబాబు తదితరులు ఉన్నారు.

'నాన్నా.. నేను వచ్చేస్తా'కు ప్రథమ బహుమతి

తోలేరులో ముగిసిన నాటిక పోటీలు

వీరవాసరం : తోలేరులో నిర్వహిస్తున్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర కళాపరిషత్ 19వ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీల్లో విజేతలకు శనివారం బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. ఉత్తమ ప్రదర్శనగా అమృత లహరి ఆర్ట్స్ థియేటర్స్ గుంటూరు వారి 'నాన్నా.. నేను వచ్చేస్తా', ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా చైతన్య కళాభారతి కరీంనగర్ వారి 'చీకటి పువ్వు' నాటిక, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా జాగృతి గ్రామీణ, గిరిజన సాంస్కృతిక, సేవా సంఘం బరువంక వారి 'కొత్త పరిమళం' నాటిక. ఉత్తమ రచనగా (చీకటి పువ్వు) పరమాత్ముని శివరాం, ఉత్తమ దర్శకుడిగా అమృత లహరి (నాన్న నేను వచ్చేస్తా), ఉత్తమ నటుడిగా రమేష్ మంచాల (చీకటిపువ్వు), బి.హరి, ఉత్తమ నటి జి.లహరి (నాన్నా నేను వచ్చేస్తా), ఉత్తమ ప్రతినాయకుడిగా జీ సామమూర్తి (కొత్త పరిమళం), సహాయ నటుడిగా ఎం.పోతినాయుడు (కొత్త పరిమళం), సహాయ నటిగా ఎస్.అమృత వర్షిణి (నాన్న నేను వచ్చేస్తా), ఉత్తమ క్యారెక్టర్ ఆర్టిస్ట్ శ్రీనివాసరావు థింక్, ఉత్తమ క్యారెక్టర్ నటిగా బండారు నాగమణి (విముక్తి), ఉత్తమ అలంకరణ దిలీప్ రమణ (కొత్త పరిమళం), ఉత్తమ సంగీతం సాయి తేజ (చీకటి పువ్వు), జ్యూరీ బహుమతి తాళ వెంకటేశ్వరరావు (నానా నేను వచ్చేస్తా), జ్యూరీ బహుమతి నడింపల్లి వెంకటేశ్వరరావు (విముక్తి), న్యాయ నిర్ణీతగా వంగా నర్సింహరావు, గంటా రామ్మోహనరావు, మానాపురం సత్యనారాయణ వ్యవహరించారని కళాపరిషత్ అధ్యక్షుడు చావాకుల సత్యనారాయణ తెలిపారు.

గ్యాస్ లీకై దంపతులకు తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న దంపతులు

పాలకొల్లు (సెంట్రల్): వంట గదిలో గ్యాస్ లీకైన కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. పాలకొల్లులోని సుబ్బారాయుడు గుడి సెంటర్ ప్రాంతంలో దూడే శ్రీరాములు, ఉదయలక్ష్మి దంపతులు నివాసం ఉంటున్నారు. శనివారం ఉదయం నిద్రలేచిన ఉదయలక్ష్మి వంట గదిలోకి వెళ్లి గ్యాస్ స్టౌ వెలిగిద్దామని లైటర్ వెలిగించింది. అప్పటికే గ్యాస్ లీకై గది అంతా వ్యాపించి ఉండటంతో లైటర్ వెలిగించగానే మంటలు ఒక్కసారిగా వ్యాపించాయి. దీంతో ఉదయలక్ష్మి శరీరం కాలి తీవ్ర గాయాలు కాగా, ఆమెను రక్షించేందుకు ప్రయత్నించిన భర్త శ్రీరాములుకు కూడా శరీరం కాలి గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి వెంటనే వీరిని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతున్నారు.

క్లుప్తంగా

వరాల వెంకన్నకు విశేష పూజలు


వరాల వెంకన్నకు ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి పర్వదిన వేడుకలు వైభవంగా జరిగాయి. వేకువ జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ నిర్వహించారు. ఉదయం స్వామివారికి అర్చనలు జరిపి, విశేషంగా అలంకరించారు. ఈసందర్భంగా స్వామివారిని ఉత్తరద్వారం నుంచి భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను జరిపారు. పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు హాజరై స్వామి వారిని దర్శించారు. హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.

ఆడుదాం ఆంధ్ర ఆటలపై అవగాహన


తణుకులో ఆడుదాం ఆంధ్ర పై అవగాహన ర్యాలీ చేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: క్రీడాకారులను ప్రోత్సహించి జాతీయ స్థాయికి వారి నైపుణ్యాన్ని తీసుకెళ్లాలనే సదుద్దేశ్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శనివారం సచివాలయాల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక 1వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్వహించిన ర్యాలీలో వార్డు ఇన్‌చార్జ్‌లు పైబోయిన ఏసుబాబు, సలాబత్తుల విక్టర్ జాకోబ్‌బాబు, ఆర్తమూరి మణికంఠరెడ్డి, గృహసారథులు, సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లు పాల్గొన్నారు. స్థానిక ఇరగవరం రోడ్డులో 11వ సచివాలయం పరిధిలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై అవగాహన, ర్యాలీలో వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు పొట్ల సురేష్, సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

తణుకులో ప్రారంభమైన బాలోత్సవం


తణుకులో నిర్వహించిన బాలోత్సవంలో పాల్గొన్న అధికారులు

తణుకు: పట్టణంలో శ్రీశ్రీ సేవా విజ్ఞాన కేంద్రం, రోటరీ క్లబ్, మానవవత సంయుక్త ఆధ్వర్యంలో తణుకులో బాలోత్సవం శనివారం ఘనంగా ప్రారంభమైంది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా డాక్టర్ హుస్సేన్ అహ్మద్, తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్‌లు పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న ప్రతిభ వెలికి తీసేందుకు ఇలాంటి ప్రదర్శనలు ఉపయోగపడతాయని చెప్పారు. ఉపన్యాసం, వ్యాసరచన, నాటికలు, ఏకపాత్రాభినయం, క్విజ్, సంగీతం, 20 అంశాల్లో నిర్వహించిన పోటీల్లో సుమారు 1500 మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. బాలోత్సవం కమిటీ ప్రధాన కార్యదర్శి పి.దక్షిణామూర్తి, పీఎల్ నర్సింహారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.పద్మావతి,మురళి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరద్వార దర్శనం.. భక్తజన సందోహం


తణుకు అర్బన్: రాష్ట్రపతి రోడ్డు వెంకటేశ్వరస్వామి ఉత్తర ద్వార దర్శనం


అత్తిలి: బల్లిపాడులో ప్రత్యేక అలకరణలో మదనగోపాలస్వామి


తాడేపల్లిగూడెం (టీటీసీ): వాసవి ఆలయంలో ఉత్తరద్వార దర్శనం ఏర్పాటు చేసిన ఆర్యవైశ్యులు

మార్మోగిన గోవింద నామస్మరణ

తణుకు అర్బన్: శ్రీవైకుంఠ (ముక్కోటి) ఏకాదశి మహోత్సవం సందర్భంగా తణుకు రాష్ట్రపతి రోడ్డులోని వెంకటేశ్వరస్వామి ఆలయం భక్తసంద్రమైంది. దేవాదాయ ధర్మాదాయ శాఖ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తెల్లవారు జాము 3 గంటల నుంచి స్వామి వారి దివ్యదర్శనం ఆలయ చైర్మన్ కొత్తపల్లి రామచంద్రరావు దంపతులు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య తదితరులు ప్రారంభించారు. భక్తులు తెల్లవారు జాము నుంచే ఆలయానికి తరలిరావడంతో ఆలయ ఆవరణ అంతా కిక్కిరిసింది. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు క్యూలైన్ లోపలకు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దాస సాహిత్య ప్రాజెక్టు వడ్లూరు, వెంకట హనుమ కోలాట భజన మండలిచే నిర్వహించిన కోలాట భజన అలరించిం ఆలయ ఈవో ముత్యాల సత్యనారాయణ భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశారు.

సజ్జాపురంలో...

సజ్జాపురం అండర్ గ్రౌండ్ ప్రాంతంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద శనివారం స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రసాద్ ఆధ్వర్యంలో పూజాదికాలు జరిపారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదములు స్వీకరించారు.

ఉత్తర ద్వారం నుంచి దర్శనమిచ్చిన శ్రీమదనగోపాలస్వామి

అత్తిలి: వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా బల్లిపాడు గ్రామంలో గల మదనగోపాలస్వామి భక్తులకు ఉత్తర ద్వారం నుంచి దర్శనమిచ్చారు. వేకువ జామున వెంకటేశ్వరస్వామికి పంచామృతాలు, పండ్ల రసాలతో అభిషేకించి, విశేషంగా అలంకరించారు. శ్రీస్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను గరుడవాహనంపై ఉంచి ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం గ్రామోత్సవాన్ని జరిపారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

ఘనంగా ముక్కోటి వైకుంఠ ఏకాదశి, గీతా జయంతి

తాడేపల్లిగూడెం (టీటీసీ): పట్టణంలోని రామచంద్రరావుపేట శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో శనివారం శ్రీకృష్ణ స్వామికి సహస్ర అష్టోత్తర పూజలు, అనంతరం ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా పలు దేవాలయాలలో అన్నసమారాధనలు జరిగాయి. శ్రీ వాసవి పంచాయతన క్షేత్రంలో కలియుగ వెంకటేశ్వర స్వామి దర్శనం ఏర్పాటు చేశారు. లక్ష్మీనారాయణ స్వామికి పంచామృతాలతో సుగంధ ద్రవ్యాలు, పండ్ల రసాలతో అభిషేకాలు, పుష్పాలతో విశేష అలంకరణలు జరిగాయి. సుబ్బారావుపేట శ్రీనివాస రామాలయంలో ముక్కోటి ఉత్సవాలు నిర్వహించారు. బస్సు డిపో వద్ద వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. పెద్ద ఆంజనేయస్వామి, చిన్న ఆంజనేయస్వామి వారి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. భాగ్యలక్ష్మి పేటలో మారుతి స్వామి వారి ఆలయంలో వైకుంఠ ముక్కోటి ఏకాదశి పూజలు జరిగాయి. భక్తులు స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు.

వైఎస్సార్‌సీపీ మండల యువజన కమిటీల ఏర్పాటు

తాడేపల్లిగూడెం: పట్టణంలోని మండల యువజన కమిటీలను పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ప్రకటించింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల యువజన విభాగాల అధ్యక్షుల్ని ప్రకటించారు. పెంటపాడు మండల యువజన అధ్యక్షుడిగా కొవ్వూరి విజయభాస్కరరెడ్డి, తాడేపల్లిగూడెం పట్టణ యువజన అధ్యక్షుడిగా చిటికెన ప్రసాద్, తాడేపల్లిగూడెం మండల యువజన విభాగం అధ్యక్షుడిగా ములకల రాంబాబులను నియమించారు. ఈసందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, యువనేత కొట్టు విశాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సంక్షేమానికి కృషి

తణుకు టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డిప్యూటీ కార్యదర్శి డాక్టర్ కిరణ్‌కుమార్ చెప్పారు. తణుకు రూరల్ మండలం మహాలక్ష్మీ చెరువు గ్రామంలో శనివారం సాయంత్రం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రుద్ర ధనరాజు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె వెంకటరెడ్డి, తణుకు నియోజకవర్గ కన్వీనర్ ఐనంపూడి శ్రీదేవి, ఎంపీడీవో కె కిరణ్‌కుమార్, వైద్యాధికారి డాక్టర్ కిషోర్ కుమార్, ఈవోపీఆర్‌డీ కోటేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఐకేపీ ఏపీఎం, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు చర్చిల ముస్తాబు


పెంటపాడు: విద్యుత్ దీపాలతో ముస్తాబైన చర్చ్


పెంటపాడు: గూడెం ఎక్లాస్ ప్యారిష్ టౌన్ లూథరన్ చర్చి


తణుకు టౌన్: క్రిస్మస్‌కు ముస్తాబైన ఆర్‌సీఎం చర్చ్

తణుకు టౌన్: మండలంలోని వివిధ క్రైస్తవ దేవాలయాలు (చర్చిలు) ముస్తాబయ్యాయి. గ్రామాల్లోని చర్చిలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించి యేసు క్రీస్తు జన్మదినోత్సవాన్ని గుర్తు చేసే పశువుల పాకను విద్యుత్ దీపాలతో అలంకరించారు. దీనితో పాటు క్రిస్మస్ ప్రదాన గుర్తును తెలిపే ఆకాశంలో నక్షత్రాలను వివిధ రంగులతో తయారు చేసిన నక్షత్రాలను వివిధ విద్యుత్ రంగుల్లో అలంకరించారు. తణుకు పట్టణంలోని ఆర్‌సీఎం చర్చి, వేల్పూరులోని సెయింట్ లూథరన్ చర్చి, మండపాకలోని ప్రవచన దేవుని సంఘం చర్చి, దువ్వ గ్రామంలోని రక్షణ సైన్యం చర్చి, వెంకట్రాయపురంలోని సెవెంత్ డే చర్చి, వీరభద్రపురంలో బేతెల్ చర్చ్‌లు మండలంలోని చర్చిలన్నీ విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా ఆలకరించారు.

క్రిస్మస్ వెలుగులు

పెంటపాడు: ప్రపంచ వ్యాప్తంగా ఈనెల 24 నుంచి క్రిస్మస్ వేడుకలు ప్రారంభం దృష్ట్యా డిసెంబర్ 1 నుంచే పలు డినామినేషన్ చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. గూడెం టౌన్ ఎ.క్లాస్ ప్యారిష్ లూథరన్ చర్చి, జట్లపాలెం, పెంటపాడు, యానాలపల్లి గ్రామాలతో పాటు, గూడెం మండలం ఆర్‌సీఎం చర్చిలు, గూడెం పట్టణంలోని బైబిలుమిషను హనోక్, డైవేష్టమ్ చర్చిలో ఆదివారం నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

తణుకు వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుల నియామకం


చేశెట్టి లలితా శంకర్


రెడ్డి మణికంఠ


పంపన సత్యనారాయణ


కర్రి హరి సుబ్బారెడ్డి

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు తణుకు అసెంబ్లీకి సంబంధించి మండల వైఎస్సార్‌సీపీ యువజన విభాగ అధ్యక్షులను పార్టీ కేంద్ర కార్యాలయం ఎంపిక చేసింది. శనివారం ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. తణుకు నియోజకవర్గంలోని తణుకు మున్సిపాలిటీకి చేశెట్టి లలితా శంకర్, తణుకు మండలానికి రెడ్డి మణికంఠ, అత్తిలి మండలానికి పంపన సత్యనారాయణ, ఇరగవరం మండలానికి కర్రి హరి సుబ్బారెడ్డిలను నియమించారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు


టీబీఆర్ సైనిక స్కూల్‌లో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

పెంటపాడు: మండలంలో టీబీఆర్ సంస్థల ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో రాష్ట్ర మాజీ సైనిక ఉద్యోగుల సంఘ నాయకులు తనబుద్ది భోగేశ్వరరావు పాల్గొని క్రిస్మస్ శుభాకంక్షలు తెలిపారు. టీబీఆర్ సంస్థల సిబ్బంది, మదర్‌వన్నిని చర్చి సిస్టర్స్ పాల్గొన్నారు. జట్లపాలెం, రావిపాడు గ్రామాల్లో వాక్యజ్యోతి చర్చి ఆధ్వర్యంలో జరిగిన వేడుకలలో ప్రవక్తిని కొమ్మిశెట్టి అమ్మాజీ, పాస్టర్ ఘనరాజు, జిల్లా పాస్టర్ల సంఘ అధ్యక్షుడు కొమ్మిశెట్టి జాజిరాజులు పాల్గొని దేవుని వాక్యం బోధించారు. చిన్నారులు వేసిన నాటికలు అలరించాయి. పలువురికి బహుమతులు అందించారు.

ఘనంగా ముక్కోటి ఉత్సవాలు


ఉంగుటూరు: స్వామివారికి పూజలు చేస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు


పెంటపాడు : బాల వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: గోపినాథపట్నం భక్తాంజనేయస్వామి ఆలయంలో ముక్కోటి ఉత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి లక్ష తమలపాకులతో దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ సొదినికుమారి దంపతులు, కుటుంబ సభ్యులు పూజలు చేశారు. వెండి మహాతోరణం అలంకరణలో ఆంజనేయస్వామి కొలువై భక్తులు దర్శనమిచ్చారు. వేలది మంది భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించారు. సహస్ర దీపాలు వెలిగించి పూజలు చేశారు. గోపూజ, సహస్ర నామాలతో పూజలు, శ్రీరామపట్టాభిషేకం హోమం చేశారు. శ్రీశైలం, కాళహస్తి దేవాలయాల నుంచి వచ్చిన ప్రచార వాహనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ మరడ రమావతి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మరడ మంగరావు తదితరులు పాల్గొన్నారు. ఉంగుటూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు.

ఘనంగా ముక్కోటి ఏకాదశి పూజలు

పెంటపాడు: ముక్కోటి పర్వదినం పురస్కరించుకొని శనివారం పెంటపాడు బాల వెంకటేశ్వరుని ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా వెంకటేశ్వరస్వామి గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారిని కొలనువాడ పెదకృష్ణంరాజు తదితరులు దర్శించుకున్నారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన సత్యసాయి భక్తుల సత్సంగం నిర్వహించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. పేదలకు దుప్పట్లు పంచారు. కె. పెంటపాడు బైరాగిమఠంలో ఆలయఫిట్ పర్సన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రత్తిపాడు వై. జంక్షన్ దుర్గమ్మ అమ్మవారి ఆలయంలో సైపురెడ్డి రాంబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

నేడు అలంపురంకు ప్రత్యేక వైద్యుల రాక

పెంటపాడు: మండలంలోని ఆదివారం అలంపురం వెంకటరమణ సేవా ఆసుపత్రికి ప్రత్యేక వైద్యులు రానున్నట్లు ట్రస్టు అధ్యక్షుడు కొలనువాడ పెద కృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ జూబ్లిహిల్స్‌కు చెందిన ప్రముఖ షుగర్, పుళ్ల, గాయాల వ్యాధుల నిపుణులు (గాంగ్రీన్) డాక్టర్ వి. రాజశేఖర్, విజయవాడకు చెందిన ప్రముఖ న్యూరో సర్జన్ తీగల రమేష్‌లు ఉచిత వైద్య పరీక్షలు చేస్తారన్నారు. ఈ సేవలను పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నక్షత్రరావు మృతికి మంత్రి కారుమూరి సంతాపం


కలిగితి నక్షత్రరావు

తణుకు అర్బన్: పట్టణానికి చెందిన దళిత నాయకుడు, బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ సూపర్‌వైజర్ కలిగితి నక్షత్రరావు (71) మృతి పట్ల మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ సంతాపం తెలిపారు. క్రైస్తవ సమాజానికి ఆయన విశేష సేవలందించారని పలువురు పేర్కొన్నారు. సంతాపం తెలిపినవారిలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, ఏఎంసీ చైర్‌పర్సన్ నత్తా కృష్ణవేణి తదితరులు ఉన్నారు.

దివ్యాంగుల పిల్లలకు విద్యా సామగ్రి అందజేత


దివ్యాంగ పిల్లలకు విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): స్థానిక భవిత సెంటర్‌లో లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు, డైమండ్స్ అధ్యక్షుడు కొప్పిశెట్టి రమణయ్య ఆధ్వర్యంలో మద్దుకూరి మెహర్ ప్రసాద్ సహకారంతో శనివారం దివ్యాంగుల పిల్లలకు స్నాక్స్, దుప్పట్లు, విద్యాసామాగ్రి అందజేశారు. ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్కే బాల ఈశ్వరయ్య, ఎం.చంద్రకుమారిలు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కొప్పిశెట్టి సాయి సత్య నారాయణ రాజు, యర్రా ఆంజనేయస్వామి, ఎం.వెంకటరత్నం, ఎం.చంద్రకుమారి, సీహెచ్ ప్రశాంతి, లియో సభ్యులు ప్రజ్ఞ, అనూష, జ్యోతి, దివ్యాంగులు పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేటి నుంచి హనుమద్ వ్రత వార్షికోత్సవాలు

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక మారుతీ టాకీస్ సెంటర్‌లో ఉన్న శ్రీదాసాంజనేయ స్వామి వారి 43వ హనుమద్ వ్రత వార్షికోత్సవాలు ఆదివారం నుంచి 28వతేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు స్వామి వారి దేవస్థానం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఐదు రోజుల పాటు దాసాంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థాన కార్యనిర్వహణ అధికారి గొట్టుముక్కల నాగ సీతారామరాజు మాట్లాడుతూ ఆదివారం కలశస్థాపన, శ్రీస్వామివారి గ్రామోత్సవం, 25న శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి వారి వ్రతం, 26న సత్యనారాయణస్వామి వత్రం, సామూహిక లక్ష తమలపాకుల పూజ, సింధూరం పూజ, 27న 108 కలశాల సుగంధ ద్రవ్యాలతో, పంచామృతాలతో అభిషేకాలు, లక్ష తమలపాకుల పూజ, 28న 108 కలశాల సుగంధ ద్రవ్యాలతో, పంచామృతాలతో అభిషేకాలు, లక్ష తమలపాకుల పూజ, అఖండ అన్న సమారధన నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు తరలివచ్చి స్వామి వారి వార్షిక మహోత్సవాల్లో పాల్గొనాలని ఆయన కోరారు.